# 'సాహిత్యం - సామాజిక చైతన్యం'

సాహిత్యం వల్ల సమాజంలో మార్పులొస్తాయా?

వస్తేగిస్తే ఏ ప్రమాణంలో ఆ మార్పులుంటాయి?

ఏ ప్రమాణంలో మార్పులున్నా అవెంత కాలముంటాయి?

పై మూడు ప్రశ్నలూ నన్ను నేను వేసుకోవాల్సి వస్తుంది (వచ్చింది). సమకాలీన సాహితీకారులు కొందరు నా రచనలు సమాజానికేవిధంగానూ ఉపయోగపడవనీ (కొండొకచో హాని కలిగించేవని) కేవలం స్వప్నలోక సంచారం చేసేవిగానే ఉన్నాయనీ... అసలు రచయితనే కాననీ అంటూ... కరవూ, దారిద్ర్యం... ఆకటి కేకలూ... దళితుల బాధలు అన్న అంశాలను అసలు స్పృశించననీ సమాజ రుగ్మతల గురించి వ్రాసి వాటికి పరిష్కారాలు సూచించననీ నిర్ధారించిన సందర్భంలో పై మూడు ప్రశ్నలు వేసుకున్నాను.

సరే అది వారి అభిప్రాయం.

ఎవరి అభిప్రాయాల వల్ల నాకుగానీ నా రచనలకుగానీ యీషణ్మాత్రం హాని వాటిల్లలేదు. వాటిల్లబోదు కూడానూ. లేకపోతే యీ క్షణాన యీ పుస్తకం మీ చేతుల్లో వుండేది కాదు.

గురజాడ కన్యాశుల్కం చదివేసీ ... నాటకం చూసేసీ మన సమాజంలో కన్యాశుల్కం అన్న జాడ్యం సమసిపోయిందనుకుంటే అది భ్రమ మాత్రమే.

అప్పటికే తగ్గుముఖం పట్టివున్న కన్యాశుల్కం క్రమేణా అంతరించిపోయింది. దాంతర్వాత ఏమొచ్చిపడిందో మనందరికీ తెలుసు.

వరకట్నం.

సరే యిప్పటికీ రోజున 2003లో వరకట్నం ఎంత బలిసిపోయిందో చెప్పక్కర్లేదు.

దిగువ మధ్యతరగతుల్లో కూడా ఓ అమ్మాయి పెళ్లి చేయాలంటే కనీసం రెండు లక్షలు... వరకట్నానికి వ్యతిరేకంగా వచ్చిన సాహిత్యాన్ని మొత్తం పోగుచేస్తే, మా కర్నూలు జగన్నాథగట్టు సైజు వుంటుంది.

ప్రస్తుతానికి వ్యభిచార వ్యతిరేక సాహిత్యం సద్దుమణిగింది.

కారణం ప్రభుత్వం, సామాజిక సేవాసంస్థలు ప్రత్యక్షంగా వ్యభిచారాన్ని సమర్థిస్తూ విపరీతంగా ప్రచారం చేయడమే. కాదంటారా? ఎయిడ్స్ ప్రకటనలు చూడండి.

'మీరు వ్యభిచరిస్తే వ్యభిచరించారుగానీ రక్షణ కవచాలైన కండోమ్స్ ధరించి మరీ వ్యభిచరించండి' అని. సెక్సు వర్కర్లకు లైసెన్సుల మంజూరీ విషయమై తీవ్ర ప్రయత్నాలు జరుగుతున్నాయి. ప్రముఖ జర్నలిస్ట్ బర్ఖాదత్ ఓ ప్రముఖ ఛానెల్లో లైసెన్సుల గురించి తీవ్రంగా చర్చించారీ మధ్య. ఇకపోతే తాగుడు.

చాలా కుటుంబాలు నలిగిపోతున్నాయి. ఈ రుగ్మతనించీ

దీనికి వ్యతిరేకంగా వచ్చిన సాహిత్యం గురించి చెప్పాలంటే వల్లకాదు. 'కల్లు మానండోయ్ బాబూ కళ్లు తెరవండోయ్' దగ్గర్నించీ టన్నులకొద్దీ రచనలు వెలువడ్డాయి. అదంతా చదివేసి తాగుడు మానారా? ఇప్పుడు అడుగడుక్కీ ఓ బారు...

(నా రచనల్లో తాగుడనీ వ్యభిచారాన్నీ గ్లోరిఫై చేస్తాననీ నాకు కార్పోరల్ పనిష్మెంట్ యివ్వాలనీ ఓ పెద్ద మనిషన్నాడీమధ్య. అది వేరే సంగతిలెండి)

ఈరోజున నేను చర్చిస్తున్నదేమిటంటే రచనలు చదివి సమాజంలో మార్పులొస్తాయా? వస్తే ఎంత లావుగా ఉంటాయి అన్నది.

నన్ను వ్యక్తిగతంగా అడిగితే 'రావు' అనంటాను.

* * *

ఇది రాస్తున్న సమయానికి మా కర్నూలు జిల్లా టాబ్లాయిడ్‌లోని వార్తలు ఓ రెండు... 'కొత్త బస్టాండు సమీపంలో ముగ్గురు ఇంజనీరింగ్ విద్యార్థులు తప్పతాగి ఓ మహిళను హింసించారు'

'కన్నకొడుకుల నిరాదరణతో జీవితంపై విరక్తి కలిగి చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్న వృద్ధురాలు' (ఈ విషయంపై కూడా చాలాచాలా సాహిత్యం గిరికి పారేసారు మన తెలుగు రచయితలు)

పై రెండు వార్తలు అత్యంత సహజంగా కనిపిస్తాయి మనకు. అసలు అలాంటి వార్తలు అలవాటైపోయాయి మనకు.

సో అందువలన తేలేదేమిటి?

కేవలం సమస్యలూ సమాజమూ అని అఘోరించకుండా మేధో వికాస దోహదకార సాహితీ సృజన కూడా చేయాలి.

తప్పంటారా? జీ హుజూర్... ●